క్లుప్తంగా

'అనపాల'కు నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డు



పురస్కారాన్ని స్వీకరిస్తున్న అనపాల ఆంజనేయులురెడ్డి

కాకినాడ రూరల్: వేసవిలో చలివేంద్రాల ద్వారా ఎందరో దాహార్తిని తీర్చే సామాజిక వేత్త అనపాల ఆంజనేయరెడ్డి ఉత్తమ సేవలకు మహాత్మాగాంధీ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిలంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడలో గాంధీ జయంతి కార్యక్రమంలో తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ విజయ్‌బాబు, ఏపీ స్టేట్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ట్రేడ్ యూనియన్ చైర్మన్ గౌతమ్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్టు ఆయన తెలిపారు.

స్టడీ మెటీరియల్ బహూకరణ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ప్లస్ టు విద్యార్థులకు పూర్వ విద్యార్థులు స్టడీ మెటీరియల్ బహూకరించారు. 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమకూర్చిన పుస్తకాలను వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా సత్తిబాబుతో కలసి హెచ్ఎం యు.లీలామనోహర్ అందజేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, కె.వీ ద్రాజు, నిమ్మన కాశీ, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామ చంద్రమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బోట్‌క్లబ్: సంత చెరువు విద్యుత్ ఉపకేంద్రం వార్షిక మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ జి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లల వీధి, రెల్లివీధి, మల్లిపాముల వీధి, జ్యోతుల మార్కెట్, మంత్రిప్రగడ వారి సత్రం, కాసికాయల వీధి, సూర్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.


నగరానికి శౌర్య జాగరణ యాత్ర



రామారావుపేటకు వచ్చిన యాత్రలో పాల్గొన్న ప్రజలు

బోట్‌క్లబ్: వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న శౌర్య జాగరణ యాత్ర బుధవారం నగరానికి చేరుకుంది. యాత్రకు వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు బిక్కిన రాజు, కార్యదర్శి జి.గోవిందు, సభ్యులు రవి వర్మ, జి.ఉదయభానోజీరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సర్పవరం జంక్షన్ నుంచి కాకినాడ విద్యుత్‌నగర్, రామారావుపేట మీదుగా జగన్నాథపురం వరకూ యాత్ర సాగింది. బిక్కిన మాట్లాడుతూ హిందూజాతి పూర్వ వైభవం కోసం అసమాన కృషి చేస్తున్న విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్లకు ప్రవేశించిన ఈ సందర్భంగా యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. సమాజానికి ఆదర్శప్రాయమైన గొప్ప సంస్థగా పరిషత్ 60 ఏళ్ల సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఏఎస్సైకి ఎస్పీ పరామర్శ



ఏఎస్సై ఆరోగ్య పరిస్థితిని ఎస్పీ సతీష్‌కుమార్‌కు వివరిస్తున్న వైద్యాధికారి

సామర్లకోట: ఏఎస్సై సింహాద్రిని ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. గణేష్ నిమజ్జనోత్సవ విధుల్లో భాగంగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఏఎస్సైని స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మరో వాహన చోదకుడు ఈ నెల ఒకటిన ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయన కాలు విరగడంతో ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆయన చికిత్స పొందుతున్నారు. ఎస్పీ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఇంటింటికీ ఆరోగ్య సురక్ష

- ఇదొక బృహత్తర కార్యక్రమం
- 1.6 కోట్ల ఇళ్లలో వైద్య సేవలు
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కార్యక్రమంలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రతి ఇంటికీ వైద్యం అందించే గొప్ప కార్యక్రమం జగనన్న సురక్ష అని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట సచివాలయం–1 పరిధిలో పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పండూరు పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరానికి పెద్ద ఎత్తున వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవల గురించి ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ల కౌంటరు, బీపీ, షుగర్ పరీక్షల కౌంటరు, మందులు, వైద్యుల కౌంటర్లను ఆయన పరిశీలించారు. స్త్రీ వ్యాధుల నిపుణులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యులతో మాట్లాడారు. శిబిరానికి ముందు సర్వే ద్వారా ఎంత మందిని గుర్తించారు, వారిలో ఎంత మందికి టోకెన్లు అందజేశారు తదితర వివరాలను వైద్యాధికారి ఆయేషా ఫాతిమాను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు పొందిన వారికి సంబంధిత వివరాలతో కూడిన బుక్‌లెట్, నెలకు సరిపడేలా అందజేసిన మందులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి నారాయణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1.6 కోట్ల ఇళ్లలో 15 వేల సచివాలయాలు పరిధిలో ఈ శిబిరాల ద్వారా ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని అన్నారు. ఇంటికి వచ్చి వలంటీరు వివరాలు నమోదు చేసుకున్న తరువాత వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వచ్చి రక్త పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు శిబిరం వద్ద వైద్య నిపుణులతో మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. ఇంకా మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్య శ్రీ ద్వారా ఆస్పత్రిల్లో వైద్యం అందజేస్తామన్నారు. శస్త్ర చికిత్స చేయించుకుంటే ఆరోగ్య ఆసరా ద్వారా రోజుకు రూ.225 చొప్పున రూ.5 వేల వరకు అందజేస్తారన్నారు. రమణయ్యపేట సచివాలయం –1 పరిధిలో 605 మందిని సర్వే ద్వారా గుర్తించగా అదనంగా మరో 150 మంది హాజరయ్యారన్నారు. గైనిక్ సమస్యలు ఉన్నట్టు 150 మందిని సర్వేలో గుర్తించడంతో వారు స్పెషలిస్టు వైద్యురాలి ద్వారా వైద్యం పొందే వీలు లభించిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణ మూర్తి, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి దవులూరి వెంకటరమణ, రేపూరు సర్పంచ్ వీరన్న, పెనుమర్తి సర్పంచ్ పెంకే ఆనందరావు, సేవాదళ్ మండల అధ్యక్షుడు మోకా కృష్ణంరాజు, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి కరీం బాషా, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, వైఎస్సార్ రాజు, మండల ఇంజినీర్ వాసుదేవరావు, ఈఓ పీఆర్డీ ఆంజనేయులు, మండల పరిషత్ ఏఓ చంద్రశేఖర్, కొవ్వాడ ఉప సర్పంచ్ తోటకూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైద్యం కోసం రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న స్థానికులు



అరట్లకట్టలో పౌష్టికాహార స్టాల్స్ పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజల ముంగిటకే వైద్యసేవలు

కరప: ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, వారి ముంగిటనే వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అమలుచేస్తోందని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజల కోసం పనిచేస్తున్న సీఎం జగన్‌ను, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికలలో గెలిపించాలని ఎంపీపీ కోరారు. గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బంది అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాలకు చెందిన 460 మంది శిబిరానికి వచ్చి, తమ పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, కాకినాడ నుంచి వచ్చిన వైద్యనిపుణులు పరీక్షలుచేసి, మందులు రాసిచ్చారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, అరట్లకట్ట, గొడ్డటిపాలెం సర్పంచ్‌లు గోపి సత్యవేణి, వాసంశెట్టి శ్రీనుబాబు పార్టీ నాయకులు, అధికారులతో కలసి కేస్ షీట్, మందులుతో కూడిన జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులను పేషంట్లకు అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పెద్దింశెట్టి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సింగినేని నానీ, గ్రామ కార్యదర్శి వై.రాంజీ హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు

కాకినాడ క్రైం: గర్భస్థ లింగ నిర్ధారణ, ఏఆర్‌టీ–సరోగసి చట్టాలు ఉల్లంఘించే ఆస్పత్రులు, స్కాన్ సెంటర్ల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సదరు సేవలు అందించేందుకు తప్పకుండా జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ద్వారా ప్రభుత్వ అనుమతులు పొందాలన్నారు. అనుమతులు లేకుండా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకోవడం తగదని హెచ్చరించారు. వాటిని నియంత్రించుకోవలసిన బాధ్యత ఆసుపత్రుల యాజమాన్యాలదేనని అన్నారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం



ట్రినిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిన ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: మండల పరిధిలో పవర గ్రామంలో ట్రినిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం సేవలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ సీఎం జగన్ తండ్రి ఆశయాన్ని కొనసాగిస్తూ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఆస్పత్రి ప్రతినిధి రికి గూటం, వైద్యులు పాల్గొన్నారు.

గడువులోగా క్రమబద్ధీకరించుకోండి



క్రమబద్ధీకరణ దరఖాస్తులపై సర్వేయర్లతో చర్చిస్తున్న పీఓ శ్రీనివాస్

కాకినాడ రూరల్: కౌడా పరిధిలో నాన్ లే అవుట్లలో స్థలాలు, భవనాలు క్రమబద్ధీకరించుకునేందుకు సహకరించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లను కౌడా ప్లానింగ్ అధికారి వి.శ్రీనివాస్ కోరారు. కౌడా వీసీ సుబ్బారావు ఆదేశాల మేరకు కౌడా కార్యాలయంలో బుధవారం సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. నాన్ లే అవుట్లలో స్థలాలు క్రమబద్ధీకరించుకునేందుకు అక్టోబరు 31 వరకు, భవనాలు క్రమబద్ధీకరణకు ఈనెల 9 వరకు గడువు ఉందని ఆయన తెలియజేశారు. స్థలాలకు సంబంధించి సుమారు 500, భవనాలకు సంబంధించి సుమారు 50 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటికి సంబంధించిన పత్రాలను సరిచేసి దరఖాస్తుల పెండింగ్‌ను క్లియర్ చేసుకుని క్రమబద్ధీకరణకు సహకరించాలని పీఓ కోరారు. సమావేశంలో ఏపీఓలు కృష్ణారావు, వెంకటరావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దోషరహిత ఓటరు జాబితాకు సహకరించండి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీధర్‌రెడ్డి

కాకినాడ సిటీ: ఓటర్ల సంక్షిప్త సవరణ జాబితా–2024 రూపకల్పనలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటరు జాబితా పరిశీలనలో వచ్చిన అభ్యంతరాలు, ఫారం 6, 7, 8 పరిష్కారాలు, మార్పులు, చేర్పులు, పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ, కొత్త ఈవీఎం, వీవీ ప్యాట్స్ పరిశీలన షెడ్యూల్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో చర్చించారు. దోష రహిత ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డీఆర్వో కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.వెంకటేశ్వరరావు, పి.రవికిరణ్, జి.సాయిబాబా, ఎస్.అప్పారావు, కె.వీరబాబు, ఎస్.శివ, కలెక్టరేట్ ఎన్నికల డీటీ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి వేడుకలకు పందిరి రాట

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఆలయ నిర్వాహకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, భక్తులు సత్తి రాజా, అర్జునరావు, మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు.

చిన్నమార్కెట్ కనకదుర్గాదేవి ఆలయంలో..

బోట్‌క్లబ్: స్థానిక 33వ డివిజన్‌లోని చిన్న మార్కెట్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో జరిగే దసరా ఉత్సవాలకు బుధవారం రాట ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న 33వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బోర వేంకటేశ్వరరావు (పెద్ద) మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 23 వరకూ దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు.

14న అథ్లెటిక్స్ సంఘం సర్వసభ్య సమావేశం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ శనివారం స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో జరుగుతుందని అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో స్టేట్ క్రాస్ కంట్రీ పోటీల నిర్వహణ, ప్రెసిడెంట్ ఎన్నిక, బ్యాంక్ ఎకౌంట్ ఓపెనింగ్, తదితర అంశాలపై చర్చిండం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

డ్వామా అధికారులకు కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో డ్వామా ఏపీఓలకు మంగళవారం ప్లానింగ్ ప్రాసెస్, క్వాలిటీ కంట్రోల్‌పై సీనియర్ ఫ్యాకల్టీ గౌరీశంకర్ శిక్షణ ఇచ్చారు. రైతులకు పంట తోటల పెంపకం నిమిత్తం మొక్కలు ఇచ్చే సమయంలో ఆరోగ్యవంతమైన మొక్కలను పంపిణీ చేయడంతో పాటు వాటి పెరుగుదలకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, నిహారిక, ప్రసాద్ శిక్షణ నిర్వహించారు.

జనరంజకంగా నాటక ప్రదర్శనలు



ఇంద్రప్రస్థం నాటికలోని సన్నివేశం

బోట్‌క్లబ్: పంతం పద్మనాభం స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక పోటీల్లో భాగంగా చివరిరోజు బుధవారం రాత్రి ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. తొలి ప్రదర్శనగా గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక ఆద్యంతం జనరంజకంగా సాగింది. ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే. అయితే ఆ ప్రేమలు హర్షించేలా ఉండాలి తప్ప అనాలోచితంగా దాని వెనుకే పరుగెడితే జీవితం విలువలు నాశనమవుతున్నాయనే సందేశంతో ప్రదర్శించారు. నాటకంలోని అన్ని సన్నివేశాలు ప్రేక్షకుల మనసులను చూరగొన్నాయి. అనంతరం తేటగుంట భాస్కరరాజు కళాపీఠం బృందం ప్రదర్శించిన క్షీరసాగర మధనం నాటకం ఆకట్టుకుంది. కుల, మతాలను రూపుమాపి మానవత్వాన్ని చాటుతూ సంకుచిత కట్టుబాట్లకు అతీతంగా జీవితాన్ని సాగించాలన్న ఇతివృత్తంతో నాటకం సాగింది. ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి ధర్మం మారుతుంది. క్షీరసాగర మధనంలో హాలహాలాన్ని విడిచి అమృతం తాగినట్లు జీవితాన్ని ఆస్వాదించాలన్న సందేశంలో సాగిన ఈ నాటికలో సన్నివేశాలకు ప్రేక్షకులు కళతాళధ్వనులు మోగాయి.

క్రీడల్లో ఎక్స్‌లెంట్

- ప్రతిభ చూపుతున్న పెద్దాపురప్పాడు విద్యార్థులు
- రెండేళ్లుగా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు
- జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపిక



పెద్దాపురప్పాడు హైస్కూలు క్రీడాకారులతో హెచ్ఎం శ్రీనివాస్, పీడీ ప్రసాద్



కాకినాడలో అధికారుల నుంచి అవార్డు తీసుకుంటున్న పీడీ ప్రసాద్ (ఫైల్)

కరప: మండలం పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ సాధించారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 42 రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పాఠశాలలు సాధించిన పాయింట్ల ఆధారంగా జిల్లా ఫస్ట్ వచ్చిన పాఠశాలను ఈ అవార్డుకు ఎంపికచేస్తారు. జాతీయ క్రీడాదినోత్సవం రోజు జిల్లా కేంద్రంలో ఈ పురస్కారాన్ని అందజేస్తారు. మొదటిసారి 2021లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 187 పాయింట్లతో ఈ పురస్కారాన్ని సాధించింది. రెండోసారి 2022–23లో 171 పాయింట్లతో మరోసారి ఈ ఘనత సాధించింది. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో, హ్యాండ్ బాల్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్ తదితర పోటీలలో ఈ పాఠశాల నుంచి 31 మంది పాల్గొన్నారు. వీరిలో బేస్‌బాల్ అండర్–14 విభాగంలో కె.సాకేత్‌కన్నా, డి.సూర్యవెంకట మణికంఠ, జి.వీరమణి కుమార్, ఎస్.సత్యనాగేంద్ర, బి.భవిత, ఎ.కరుణ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో ఎం.రాజేష్, ఎస్.మణికంఠ, బి.తరుణశ్రీ రాష్ట్రబేస్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. పీడీ ప్రసాద్, హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్‌ల కృషితో ఈ ఘటన సాధిస్తోంది.

ఇంజినీరింగ్ చదువుతా



పీడీ సార్ తర్ఫీదు ఇవ్వడంతో మెళకువలు నేర్చుకున్నా. జిల్లాస్థాయి బేస్ బాల్ పోటీలలో సెకండ్ ప్రైజ్ సాధించడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాను. ఆటలలో రాణిస్తూనే ఇంజినీరింగ్ చదివి మంచి ఉద్యోగం సాధించాలని ఉంది.

– దేగల సూర్య వెంకట మణికంఠ, 8వ తరగతి

రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యా



జిల్లాస్థాయి బేస్ బాల్ పోటీలలో అండర్–14 విభాగంలో రాణించి రాష్ట్ర జట్టు ఎంపికయ్యా. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ పొందుతున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది.

– కె.సాకేత్‌కన్నా 8వ తరగతి

బేస్‌బాల్ క్రీడాకారిణిగా



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో బేస్‌బాల్ నేర్చుకున్నా. జిల్లాస్థాయి పోటీల్లో అండర్–14లో ప్రతిభ కనబరచి రాష్ట్రజట్టుకు ఎంపికయ్యా. జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు శిక్షణ పొందుతున్నా.

– బచ్చుల భవిత, 8వ తరగతి

మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం



విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నాను. ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో శిక్షణ ఇచ్చి, స్కూల్ గేమ్స్‌లో పాల్గొనేలా చైతన్యపరుస్తున్నా. విద్యార్థుల ప్రతిభ వల్లే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ పురస్కారం రెండుసార్లు కైవసం చేసుకున్నాం.

– టీవీవీఎస్‌వీ ప్రసాద్, పీడీ, స్కూల్‌గేమ్స్ జిల్లా ప్రధానకార్యదర్శి, పెద్దాపురప్పాడు హైస్కూలు